నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 22 జూన్ 2024 | MEDAK

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వద్ద ఈడీ దాడుల వివరాలు తెలుసుకుంటున్న హరీశ్‌రావు

వేధింపులను ధైర్యంగా ఎదుర్కొంటాం

- ఐటీ, ఈడీ దాడులకు భయపడం
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను టార్గెట్ చేసిన కాంగ్రెస్,బీజేపీ ప్రభుత్వాలు
- పటాన్‌చెరు ఎమ్మెల్యే ఇంట్లో ఎలాంటి అక్రమాస్తులు లభించలేదు..
- ఈడీ బృందానికి ఎలాంటి అక్రమాలు కనిపించలేదు
- ఇంట్లో పిల్లలు ఏడుస్తున్నా ఈడీ అధికారులు కర్కషంగా వ్యవహరించారు
- బీఆర్ఎస్ అన్ని తుఫానులను ధైర్యంగా ఎదుర్కొంటుంది
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- పటాన్‌చెరు ఎమ్మెల్యే కుటుంబానికి ధైర్యం చెప్పిన హరీశ్‌రావు

పటాన్‌చెరు, జూన్ 21 : బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని కేంద్రంలోని బీజేపీ, తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు వేధింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఈడీ దాడుల నేపథ్యంలో శుక్రవారం పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కుటుంబాన్ని హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నాయకుల బృందం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నీట్ పేపర్లు లీకైతే కేంద్ర సర్కారు చోద్యం చూస్తున్నదన్నారు. నీట్ పరీక్ష ప్రశ్నపత్రం అంగట్లో సరుకైందన్నారు. నీట్ పేపర్‌ను లీక్ చేసిన గుజరాత్, బీహార్ గ్యాంగ్‌పై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. అక్కడ ఈడీ దాడులేందుకు జరగడం లేదని నిలదీశారు. ఈడీ, ఐటీ అధికారులను కేవలం ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నాయకులను భయపెట్టేందుకు మాత్రమే వాడుతారా అని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాలు ఆశించే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇంటిపై ఈడీ దాడులు జరిగాయని స్పష్టం అవుతున్నదన్నారు. అధికార పార్టీ నేతలకు ఒక నీతి, ప్రతిపక్ష నేతలపై మరో నీతిని కేంద్రం అవలంభిస్తున్నదని విమర్శించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇంట్లో ఎలాంటి అక్రమాస్తులు లభించలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను భయపెట్టి లొంగదీసుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒత్తిడికి గురిచేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ శ్రీరంగనీతులన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని, ఈడీ అధికారులకు అన్ని విధాలుగా సహకరించారని, ఈడీకి ఎలాంటి అక్రమాస్తులు కనిపించ లేదని హరీశ్‌రావు అన్నారు. ఇంట్లో చిన్న పిల్లలు ఏడుస్తున్నా వారిని కలిసేందుకు ఈడీ బృందం నిరాకరించి కర్కషంగా వ్యవహరించిందని ఆరోపించారు. పసిపిల్లలను అమ్మానాన్నల వద్దకు వెళ్లకుండా, అమ్మానాన్నలను కలవకుండా ఈడీ అధికారులు అడ్డుకున్నారని, కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఎమ్మెల్యేను భయభ్రాంతులకు గురిచేసేందుకు చూశారన్నారు. బీఆర్ఎస్‌కు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని, తప్పకుండా ధర్మం గెలుస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో తప్పుచేసిన వారిని శిక్షిస్తే తప్పులేదని, కానీ.. ఎంతసేపు ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధించడం సబబు కాదని హరీశ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా గూడెం మహిపాల్‌రెడ్డితో హరీశ్‌రావుతో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు మాట్లాడి ఈడీ దాడులపై సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు గూడెం మహిపాల్‌రెడ్డి వెంట ఉంటారని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేపై రాజకీయ కక్షతో ఈడీ దాడులు చేయడాన్ని ఖండించారు. హరీశ్‌రావు వెంట జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యేలు చింతాప్రభాకర్, మానిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, వైస్ చైర్మన్ ప్రభాకర్, గూడెం మధుసూదన్‌రెడ్డి, తొంట అంజయ్యయాదవ్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, తదితరులు ఉన్నారు.


పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు : ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

తన నివాసానికి ఈడీ అధికారులు వచ్చి ప్రతి పేపర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారని, లాకర్ల నెంబర్లు, సెల్‌ఫోన్ నెంబర్లు తెలుసుకుని వాటి వివరాలు రాసుకున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల రాకపోకలను సైతం అడ్డుకున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న చిన్నారులు ఏడుస్తున్నా అధికారులు స్పందించ లేదన్నారు. తన తమ్ముడి నివాసంలోనూ ఇలానే వ్యవహరించారన్నారు. వారు కోరిన ప్రతి పేపర్‌ను చూపించామన్నారు. తాను కొన్న చెప్పుల రసీదు కూడా భద్రంగా ఉంచుతానని, ఏటా ఇన్‌కం ట్యాక్స్ కడతామని, చట్ట ప్రకారం వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అక్రమాస్తులు సంపాదించాలనే ఆలోచనన తనకు లేదని, ప్రజలకు చిత్తశుద్ధితో ప్రజా సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఈడీ బృందానికి ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. కుటుంబ సభ్యుల పేరున ఉన్న బంగారం లెక్కలు కూడా చూశారన్నారు. వారు అడిగిన ప్రతి డాక్యుమెంట్, ఆధారం, సమాచారం ఇచ్చామన్నారు. చివరికి ఎలాంటి ఆధారం లేకుండా పోవడంతో వారు తిరుగుముఖం పట్టారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.

యోగాసనాలు వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్

మానసిక వికాసానికి యోగా దోహదం

సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట, జూన్ 21: మానసిక వికాసానికి యోగా దోహదం చేస్తుందని సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో యోగా ఫర్ సెల్ఫ్, యోగా ఫర్ సొసైటీ అనే సంకల్ప నినాదంతో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆయుష్ విభాగం, భారత స్వామి ట్రస్ట్, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో దశాబ్ది యోగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్‌తో కలిసి చైర్‌పర్సన్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా రోజాశర్మ మాట్లాడుతూ ప్రతిఒక్కరు యోగా చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో యోగాను భాగం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు మార్కుల గురించే కాకుండా ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. దృఢమైన మనసు, దృఢమైన శరీరం ఉన్న చోట విద్య వర్ధిల్లుతుందన్నారు. యోగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని తెలిపారు. వేడుకల్లో 600 మంది సామూహిక యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగా గురువు తోట సతీశ్, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అధ్యక్షుడు తోట అశోక్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ ఉమాదేవి, వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ పూర్ణిమ ఎల్లం, డిప్యూటీ డీఎం హెచ్‌వో కాశీనాథ్, పతాంజలి యోగా సమితి చీఫ్ పాట్రన్ అంజయ్య, భారత స్వామి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాములు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, యోగా శిక్షకురాలు సంధ్య, ఆయా సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో పల్లకీసేవ

పాపన్నపేట, జూన్ 21: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గామాత సన్నిధిలో పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేకపూజాలు చేసి పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులతో పాటు ఆలయ చైర్మన్ బాలగౌడ్, ఈవో వినోద్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

వేతనం కోసం ఎదురుచూపులు

హుస్నాబాద్ మున్సిపల్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు లేవు

హుస్నాబాద్ టౌన్, జూన్ 21: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీలో 113 మంది పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జనం నిద్రలేవక ముందే పట్టణాన్ని శుభ్రంగా ఉంచే మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితోపాటు పలు విభాగాలకు చెందిన కార్మికులకు మూ డు నెలలుగా వేతనాలు రావడం లేదు. 113 మంది పారిశుధ్య , విద్యుత్, మంచి నీటి సరఫరాతో పాటు వాహనాల డ్రైవర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతినెలా దాదాపు రూ.18 లక్షలు వేతనాల రూపంలో చెల్లిస్తున్నారు. మున్సిపాలిటికి వస్తున్న అంగడి ఆదా యం, ఇంటి, నల్లా, ఇంటి అనుమతులు, వ్యాపార లైసెన్సుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుని సిబ్బందికి వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ ఫండ్‌లో సరిపడా ఆదాయం లేకపోతే పట్టణ ప్రగతికి చెందిన నిధులను సైతం సిబ్బంది వేతనాలకు అందించి తిరిగి జమచేసేవారు. ప్రస్తుతం వేతనాలు రాకపోవడంతో మున్సిపల్ సిబ్బంది అప్పు లు చేసి కుటుంబాలను పోషించుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పట్టణ ప్రగతి నిధుల ఆపడంతో పా టు ఆశించిన పన్ను వసూళ్లు కాకపోవడంతో సిబ్బందికి వేతనాలను సకాలంలో అందించలేక పోతున్నారనేని తెలిసింది. ఈ విషయంపై కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. వారు అందుబాటులో లేరు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

రామచంద్రాపురం, జూన్ 21: ప్రభుత్వం రాజకీయాలకతీతంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్‌లో రూ.8.5కోట్లతో నిర్మించిన నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలితాసోమిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే మున్సిపల్ కార్యాలయ భవనాన్ని, రేడియల్ రోడ్డులో ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లను ప్రారంభించారు. అంతకుముందు తెల్లాపూర్ ముఖద్వారంలోని గద్దర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 105 అడుగుల జాతీయ పతాకాన్ని, మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించారు. రూ.2 కోట్లతో నిర్మించనున్న గద్దర్ ఆడిటోరియానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదన్నారు. చెరువులు, కుంటల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉన్నదన్నారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రాంరెడ్డి, ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు బాబ్జీ శ్రీశైలం, నాగరాజు, భరత్, రాజు, రాంసింగ్, పావని, మయూరి, మంజుల, జ్యోతి, చిట్టి, కోఆప్షన్ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, జయలక్ష్మి, కార్పొరేటర్ పుష్పానగేశ్, అమీన్‌పూర్ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, నీలం మధు, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై భయం వద్దు

మామిడ్గిలో వైద్యశిబిరం

న్యాల్‌కల్, జూన్ 21: మండలంలోని మామిడ్గి గ్రామాన్ని సంగారెడ్డి జిల్లా వైద్యాధికారులు సందర్శించారు. శుక్రవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన మామిడ్గిలో డెంగీ కలకలం అనే వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. జిల్లా మలేరియా అధికారి ప్రవీణ్‌కుమార్, మండల అభివృద్ధి అధికారి సురేశ్ గ్రామాన్ని సందర్శించారు. బీదర్ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడి, వారి వైద్య పరీక్షల రిపోర్టులను పరిశీలించారు. వారికి సోకింది డెంగీ సస్పెక్టెడ్ కేసులన్నారు. డెంగీ అని నిర్ధారించలేమన్నారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు సోకకుండా ఇంటింటికెళ్లి వైద్యసిబ్బంది సర్వేలు చేపట్టడమే కాకుండా జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్నామని తెలిపారు. వారం రోజులపాటు గ్రామంలో వైద్య క్యాంపును కొనసాగిస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న వారు వైద్యాధికారులను సంప్రదించి పరీక్షలు చేసుకోవాలన్నారు. వారి వెంట మామిడ్గి ఆరోగ్య ఉప కేంద్ర వైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి, సిబ్బంది మల్లికార్జున్, చండీదేవి, ఎన్ఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

మామిడ్గి గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న సంగారెడ్డి జిల్లా మలేరియా అధికారి ప్రవీణ్‌కుమార్

గొడ్డలి వేటుకు నేలకొరిగిన హరితహారం చెట్లు

హరితహారంపై గొడ్డలి వేటు

వర్గల్, జూన్ 21: హరితహారంపై గొడ్డలి వేటు పడింది. పచ్చదనమే ప్రగతికి మెట్టు అన్న లక్ష్యంతో బీఆర్ఎస్ హయాంలో హరితహారంలో నాటిన మొ క్కలు ఏపుగా పెరిగి నీడనిస్తున్నాయి. ఇప్పుడు ఆ చెట్లకు కరెంట్ లైన్లు శాపంగా మారి గొడ్డలి వేటు కు బలవుతున్నాయి. వర్గల్ మండలంలోని శాకారం-తున్కిఖల్సా గ్రామాల మధ్య డూపాయింట్ కంపెనీ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను విద్యుత్ అధికారులు వైర్లకు అడ్డుగా వస్తున్నాయని నరికి వేయడంతో రోడ్డు కళాహీనంగా కనిపిస్తుంది.

అప్పటి బాధలు ఇంకా కండ్లముందే ఉన్నయ్..

ములుగు, జూన్ 21: తెలంగాణ రాక ముందు కరెంట్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడు కరెంట్ వస్తదో పోతదో తెల్వక ఎన్నో గోసలు పడ్డం. ఏనాడూ కంటి నిండా నిద్ర కూడా పోలేదు. కరెంట్ కోసం రాత్రంతా జాగారం చేసేటోళ్లం. ఎంతో మంది రైతులు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు వదిలిండ్రు. కేసీఆర్ సారు పుణ్యమా అని రాత్రి పూట బాయిలకాడ పండే బాధలు పోయినయ్. 24గంటల నాణ్యమైన విద్యుత్ ఇచ్చుడుతోటి ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు మోటర్లు ఆన్ చేసి పంటలకు నీరు అందించుకున్నం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినంక మళ్ల కరెంటు కష్టాలు మొదలైనయ్.

- సాయిలు, రైతు, మాచాన్‌పల్లి

తెలంగాణ రాక ముందు ఎట్లుండెనో.. ఇప్పుడూ అదే పరిస్థితి

రాయపోల్, జూన్ 21 : రైతులు సంతోషంగా లేరు..తెలంగాణ రాక ముందు ఎట్లుండెనో ఇప్పుడూ అదే పరిస్థితి. ఇటు కాలం బాగలేదు. పంటలు చేతికొచ్చే పరిస్థితి అస్సలు కనిపించడం లేదు. కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తే ఇష్టం వచ్చిన పంటలు పండించినం. కాంగ్రెస్ అచ్చినంక మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఊళ్లో ఎవరిని ఆడిగినా కరెంట్ ఎప్పుడు వస్తుదో చెప్పలేని పరిస్థితి. వ్యవసాయానికి 24 గంటలు, గృహ అవసరాలు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. విద్యుత్ విషయంతో కేసీఆర్ హయాంలో పండుగలా ఉండేది. నేడు బోర్లు వద్ద కరెంట్ కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

-బాగన్నగారి రంగారెడ్డి, రైతు, రాయపోల్ మండలం

కరెంటు కోతలతో ఇబ్బంది పడుతున్నాం..

సిద్దిపేట కమాన్, జూన్ 21: కేసీఆర్ పాలనలో కరెంట్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండే. రెప్పపాటు సమయం కరెంటు పోయేది కాదు. ఇప్పుడు కరెంటు కోతలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కరెంటు మాటమాటికి ట్రిప్ అవుతుంది. రాత్రి సమయంలో కరెంటు పోతున్నది. పిల్లలు, వృద్ధులు కరెంటు పోతే ఇబ్బందులు పడాల్సి వసున్నది.కరెంటోళ్లకు ఫోన్ చేస్తే చెట్ల కొమ్మలు కట్ చేస్తున్నామని..లైన్ రిపేరు ఉందని, ఏదో ఒకటి చెబుతూ ఫోన్ కట్ చేస్తున్నారు. ఒక్కో సమయంలో రెండు గంటలపాటు కరెంటు నిలిచిన సందర్భాలూ ఉన్నాయి. బీఆర్ఎస్ పాలనలో కరెంటు అసలే పోలేదు. మళ్లీ పాతరోజులే వచ్చాయి.

- పవన్, సిద్దిపేట

పదేండ్లు కరెంట్ కష్టాలే లేవు..

రామాయంపేట, జూన్ 21: పదేండ్లు మాకు కరెంట్ కష్టాలే తెల్వదు. కేసీఆర్ సార్ ఎక్కడి నుంచి తెచ్చిండో ఏమో గానీ, మేము ఎప్పుడూ కూడా కరెంటు కోసం ఎదురు చూడలేదు. పదేండ్ల నుంచి వ్యవసాయం పండుగలా చేసుకున్నాం. కాంగ్రెస్ అచ్చినంక తెలంగాణ రాకముందు ఎలాంటి కష్టాలు పడ్డామో, మళ్లీ ఇప్పుడు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ సర్కారు రావడంతోనే యాసంగిలో పడిన కష్టాలు ఎప్పుడూ పడలేదు. రైతులు వేసిన వరికి సరిగా నీరందక, కరెంట్ లేక తీవ్రమైన నష్టాలకు గురయ్యాం. వానకాలంలోనైనా కరెంట్ సక్కగ వస్తదో, రాదో తెలియడం లేదు. ఇప్పుడే ఇన్ని కష్టాలు ఉంటే.. రేపు ఇంకెన్ని కష్టాలు ఉంటాయో.

-అన్నమైన రాజయ్య, రైతు, రామాయంపేట

కేసీఆర్ సార్‌ను బద్నాం చేసే కుట్ర

రామాయంపేట, జూన్ 21: కరెంటు సరిగ్గా ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ సార్‌ను బద్నాం చేస్తుండ్రు. గప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మాకు మంచిగ కరెంటు ఉండే. గిప్పుడైతే కరెంటు గంట కూడా ఉంటలేదు. వంటింట్లో పని చేసుకుందామంటే కరెంట్‌తో తిప్పలైతుంది. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు మాకు ఏ దానికి ఇబ్బంది లేకుండే. మళ్లీ ఇప్పుడు కరెంట్ కష్టాలు మొదలైనాయ్. మంచిగా కరెంట్ ఇచ్చిన సార్ మీద ఏవేవో బద్నాంలు లేపుతుండ్రు అది మంచి పద్ధతి కాదు. మీరు కూడా మంచిగా కరెంట్ ఇచ్చి మంచిపేరు తెచ్చుకోండ్రి.

-మెక్కొండ వసంత, గృహిణి, రామాయంపేట

కరెంట్ కష్టాలు తెచ్చిన కాంగ్రెస్

మిరుదొడ్డి, జూన్ 21 : కాంగ్రెస్ మళ్లీ కరెంట్ కష్టాలు తెచ్చింది. పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతుల బాయిలకాడికి, ఇండ్లకు 24 గంటలపాటు కరెంట్ పోకుంటా ఇచ్చిండు. గియ్యాల కాంగ్రెసోళ్లు అచ్చినంకా మళ్లీ పాత రోజులే అచ్చినయ్. సక్కగా కరెంట్ రాకా యాసంగిలో ఏసీన వరి పంట ఎండిపోయింది. కరెంట్ గిట్లపోతే రైతులందరికీ శాన భాదైతది. సీఎం రేవంత్ రెడ్డి బాయిల కాడికి, ఇండ్ల కాడికి సక్కగా కరెంటు ఇయాలే. లేకుంటే ఇబ్బందులే...గిట్ల కరెంట్ అచ్చుడు..పోవుడు అతే అందరికీ నష్టమే...మరీ సర్కారు ఆలోచన చేసి మంచిగా కరెంట్ ఇయాలే...

-ర్యాకం కిష్టయ్య, రైతు, మిరుదొడ్డి

మళ్లీ పాత రోజులే..

తెలంగాణ సర్కారు హయాంలో రైతుల పొలాలకు నిరంతర కరెంట్ వచ్చేది. కాంగ్రెస్ వచ్చినంక ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మళ్లీ పాతరోజులు వచ్చినయ్. కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలువకుండా పోయింది. ఇట్లా అయితే రైతుల పరిస్థితి ఏమిటి. ఎవుసాన్నే నమ్ముకున్న రైతులం. కరంట్ ఉంటేనే పంటలు పండుతయ్.. లేకపోతే పంటకు పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం అంతా వృథా అవుతుంది. కరంట్ సరిగా లేకపోతే కరువు వస్తుంది. మా రైతుల పరిస్థితి తిరిగి అప్పులపాలైతది. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు రైతుల గురించి ఆలోచన చేసి నిరంతర కరెంట్ ఇవ్వాలి. రైతు ఏడిస్తే రాజ్యంలో కరువుకాటకాలు తాండవిస్తాయని కాంగ్రెసోళ్లు గుర్తుంచుకోవాలి.

-విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు, గుమ్మడిదల గ్రామం, మండలం